క్లుప్తంగా

క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న ఎంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: విద్యార్థులు క్రమ శిక్షణతో చదవి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ సర్దార్ నాయక్ సూచించారు. బుధవారం మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు చవ్వ తేజ, నవీన్ రెడ్డిలు విద్యార్థులకు 120 జతల బూట్లు, సాక్సులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సుధాకర్, నాగార్జున, శీధర్, కరణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మైనార్టీ మహిళాశక్తి పథకం కింద మంజూరైన కుట్టు మిషన్లను మైనార్టీ మహిళలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని రైతువేదిక భవనంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మెకానిక్ బాబా, ఖాదర్ ఖాద్రి, అనిత, ఫరీద్, కొండల్‌రెడ్డి, సలీం, విజయ్‌రాథోడ్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు..



గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను.. బుధవారం కొనాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గర్భిణులకు బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లమ్మ, మాజీ ఎంపీటీసీ సరిత, గ్రామ కార్యదర్శి రమ్య, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, నారయ్య, వెంకటయ్య, యాదయ్య, దేవేందర్, వైద్య సిబ్బంది అలీం, మారతమ్మ, ఆశ కార్యకర్తలు లావణ్య, స్వరూప పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్– సీఐటీయూ, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల పిలుపుమేరకు ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ పిలుపునిచ్చారు. బుధవారం కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు మహేశ్, రవి, సుధాకర్, వెంకటేశ్, అంజయ్య, సరిత, నరేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బడికి గ్రీన్ బోర్డులు..



పడకల్ ప్రాథమిక పాఠశాలలకు గ్రీన్‌బోర్డులు అందజేస్తున్న దాత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవునిపడకల్ ప్రాథమిక పాఠశాల, రావిచేడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఎర్ర సుధాకర్‌రెడ్డి బుధవారం గ్రీన్‌బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, రఘుపతి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అశోక్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శంకర్, యాదగిరి, నితిన్, సతీష్, రమేశ్, స్వరూప, మంజుల, వినోద్, రాజేశ్వరి, సాబేర్, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వానరాక.. రాకపోకలు సాగక

బురదమయంగా రోడ్లు..
ఇబ్బంది పడుతున్న ప్రజలు

- కాలినడకన వెళ్లలేని దుస్థితి
- మట్టిరోడ్లతో 'పల్లె'వెలుగుకు దూరం
- బీటీకి నోచుకోని మైసిగండి– గోవిందాయిపల్లి మార్గం



గోవిందాయిపల్లి- మైసిగండి గ్రామాల మధ్య మట్టి రోడ్డు

స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా.. కొన్ని గ్రామాలు నేటికీ బీటీరోడ్లకు నోచుకోవడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు రవాణా అసౌకర్యంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలు కాదుకదా.. కనీసం కాలినడక కూడా సాగని దుస్థితి నెలకొంది.

కడ్తాల్: రాష్ట్ర రాజధానికి సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై మైసిగండి గ్రామం నుంచి 3 కిలో మీటర్ల దూరం ఉన్న గోవిందాయిపల్లిలో ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సులు కూడా రావడం లేదు. బీటీరోడ్డు సౌకర్యం లేక, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారి, ప్రాంత ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ద్విచక్రవాహనం, ఆటోలు నడవలేని పరిస్థితి. ఫలితంగా ఇక్కడి ప్రజలు హైదరాబాద్, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే మైసిగండి వరకు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

గోడు వినని పాలకులు

కడ్తాల్ మండలం గోవిందాయిపల్లికి బీటీరోడ్డు నిర్మించాలని ఏళ్లుగా విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో కర్కల్‌పహాడ్ గ్రామ పంచాయతీలో ఉన్న గోవిందాయిపల్లి.. ఐదేళ్ల క్రితం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామం నుంచి 3 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి ఉంది. మైసిగండి రోడ్డు నుంచి గోవిందాయిపల్లి వరకు బీటీరోడ్డు నిర్మించాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ.. అది నెరవేరడం లేదు. మట్టి రోడ్డు, ఆపై ఏర్పడిన గుంతలు, ఎత్తుపల్లాలు, కయ్యలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డుపూర్తిగా బురదమయంగా మారి.. రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది.

బీటీ రోడ్డు నిర్మిస్తే..



బురదమయంగా గోవిందాయిపల్లి మార్గం

మైసిగండి నుంచి గోవిందాయిపల్లి మీదుగా ఎక్వాయిపల్లి వరకు బీటీరోడ్డు నిర్మించి, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని గోవిందాయిల్లి వాసులు పేర్కొంటున్నారు. అదే విధంగా ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి మీదుగా మైసిగండి వరకు బీటీని నిర్మిస్తే.. మండల కేంద్రానికి దూర భారం తగ్గుతుంది. రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. మైసిగండి నుంచి గోవిందాయిపల్లి, ఎక్వాయిపల్లి మీదుగా బీటీ నిర్మాణం చేపడితే మండల పరిధి చరికొండ, ముద్విన్, ఎక్వాయిపల్లి గ్రామాల ప్రజలకు, మండల కేంద్రానికి సుమారు 4 కిలో మీటర్ల దూర భారం తగ్గనుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి.. ఆయా ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగు పర్చి, ఇబ్బందులు తొలగించాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మైసిగండి నుంచి గోవిందాయిపల్లి మీదుగా.. బీటీ నిర్మాణం చేపడితే కడ్తాల్ మండల కేంద్రానికి వెళ్లేందుకు ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ ప్రజలకు దూర భారం తగ్గుతుంది. బస్సు సౌకర్యం కల్పిస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. బీటీ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఎల్లాగౌడ్, మాజీ ఉప సర్పంచ్, గోవిందాయిపల్లి

ప్రతిపాదనలు పంపాం



మైసిగండి నుంచి గోవిందాయిపల్లి వరకు, గోవిందాయిపల్లి నుంచి ఏక్వాయిపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే.. రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. రవాణా మార్గాన్ని మెరుగుపరుస్తాం. ప్రజల ఇక్కట్లను తొలగిస్తాం.

– పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

పుస్తకాల దందాను అరికట్టండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యాచారం: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విప్లవ్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. పుస్తకాల దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పుడమి ఉన్నత పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ శ్రేణులు ఆందోళన చేశారు. అధిక ధరలకు బుక్స్ విక్రయిస్తున్నవారిపై విద్యాశాఖ అధికారులు నిఘా పెట్టి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ పాండు రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. నాయకులు అజయ్, రోహిత్, హర్షిత్, వరుణ్, మహేశ్, భరత్ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

యాచారం: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని యాచారం మండలం తక్కళ్లపల్లి మాజీ ఉప సర్పంచ్ పగడాల శ్రీశైలం కోరారు. బుధవారం ఎంపీడీఓ రాధారాణికి వినతిపత్రం అందజేశారు.

అసత్య ప్రచారం తగదు

కడ్తాల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై సర్వే పేరిట బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్ అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఓ యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేసిన కథనం కట్టుకథేనని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని తెలిపారు. సర్వే చేసిన వారు శాంపిల్స్ ఉంటే ప్రసారం చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం తగదని, ఇలాగే వ్యవహరిస్తే సదరు చానల్ నిర్వాహకులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



దుకాణదారుడికి జరిమానా రసీదు అందజేస్తున్న పుర సిబ్బంది

తుర్కయంజాల్: ప్లాస్టిక్ రహిత తుర్కయంజాల్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి కోరారు. బుధవారం కమిషనర్ ఆదేశాలతో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్, సిబ్బంది బేకరీలు, జనరల్ స్టోర్స్ తదితర వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలు దుకాణాలకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడటం వలన మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని, ప్లాస్టిక్‌ను వినియోగించరాని చెప్పారు.

వరుణుడి కటాక్షం.. కర్షకుల హర్షం

మూడు రోజులుగా ముసురు

ఇబ్రహీంపట్నం: వరుణుడి కటాక్షానికై నిరీక్షించిన అన్నదాతలు, ప్రజలకు ప్రస్తుత వర్షాలు కొండంత ఊరటనిచ్చాయి. మూడు రోజులుగా ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ముసురు పడుతున్నప్పటికీ.. మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. వానాకాలం ప్రారంభానికి ముందు కురిసిన భారీ వాన.. నెలరోజుల అనంతరం దంచికొట్టడంతో కర్షకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సాగు పనులను ముమ్మరం చేశారు. కానీ.. బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరగక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో సగటున వర్షపాతం 49.9 మీ.మీటర్లుగా నమోదు కాగా.. మంగల్‌పల్లి 57.3 మీ.మీ, దండుమైలారంలో 52.8 మీ.మీ, ఎల్మినేడులో 45.8 మీ.మీ, ఇబ్రహీంపట్నంలో 39.5గా నమోదు అయింది.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ శ్రీరాం కాలనీలోని శ్రీహర్ష టెక్నో పాఠశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, పలు పండుగలు, గిరిజన సంస్కృతి, పంజాబీ డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరాంకాలనీలోని పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో ఉంచుకొని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో విద్యనందించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు విలువలను కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉస్కామూరి నిరంజన్, స్కూల్ కరెస్పాండెంట్ ఉస్కామూరి శిరీషబాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, స్కూల్ వైస్ చైర్‌పర్సన్ ఉస్కామూరి సుజాత, అకాడమిక్ డీన్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ పి.స్వప్న, వి.విష్ణు, డాక్టర్ సంతోష్, డాక్టర్ అనంత గుప్తా, అంజనేయులు, ఆదిత్య స్కూల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

మీర్‌పేట: ఉద్యోగ విరమణ పొందిన మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను బుధవారం ఆయన నివాసంలో బీజేపీ కార్పొరేషన్–1 అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముఖేష్‌ముదిరాజ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, సోమేశ్వర్, భీంరాజ్, విక్కీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ హాజరవుతున్నారని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పరిశ్రమ వద్ద ఏర్పాటు చేస్తున్న సీఎం సభా వేదికను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు పోలీసులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నేనావత్ రాజునాయక్, ఎడ్మ మోహన్‌రెడ్డి, లాజర్, మద్ది కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నడికూడ శివ పలువురు పాల్గొన్నారు.

స్వీయ రక్షణే మేలు

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం వైద్యురాలు రాధిక



ఇబ్రహీంపట్నం: వానాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు రాధిక అన్నారు. రోగాల బారిన పడి, ఇబ్బంది పడే బదులు.. అప్రమత్తంగా ఉండటమే మేలని స్పష్టం చేస్తున్నారు. విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో డాక్టర్‌తో 'సాక్షి' ముఖాముఖి.

ప్రశ్న: ప్రస్తుతం రోగుల సంఖ్య పెరిగిందా?

జవాబు: ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వాతావరణం చల్లబడింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ముసిరే ప్రమాదం ఉంది. జలుబు, దుగ్గు, జ్వరం తదితర లక్షణాలతో రోగుల సంఖ్య పెరుగుతోంది.

ప్రశ్న: ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: ఈ సీజన్‌లో దోమలు, ఈగలు బాగా వృద్ధి చెందుతాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. లేదంటే వ్యాధులు సంక్రమిస్తాయి.

ప్రశ్న: ఎలాంటి రోగాలు వస్తాయి?

జవాబు: దోమలు, ఈగలు కలుషితనీరు వలన కలరా, మలేరియా, డెంగీ, వాంతులు, విరేచనాలు, చర్మ వ్యాధులు సోకే అవకాశం ఉంది. పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. మధ్యాహ్న వేళలో కుట్టే దోమతో డెంగీ వ్యాపిస్తుంది.

ప్రశ్న: వీటి బారిన పడకుండా ఏం చేయాలి?

జవాబు: నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి వడబోసిన నీటిని తాగాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను ఆరగించాలి. మురికి కాల్వలు, ఇళ్లు, పూలకుండిల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రశ్న: రోగులకు సరిపడా మందులున్నాయా?

జవాబు: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపోను ఔషధాలు ఉన్నాయి. రోగులు పెరిగినా మందుల కొరత లేదు.

ప్రశ్న: రోగులకు పరీక్షలు చేస్తున్నారా?

జవాబు: రక్త పరీక్షలు చేస్తున్నాం. ఇంకా మెరుగైన టెస్టుల కోసం శాంపిల్స్ సేకరించి, నగరంలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపుతున్నాం. అక్కడ నుంచి వచ్చే రిపోర్టు ఆధారంగా పేషంట్లకు వైద్య చికిత్స అందిస్తున్నాం.

ప్రశ్న: ఈ సీజన్‌లో మీరిచ్చే సలహా?

జవాబు: స్వీయ రక్షణపై దృష్టిసారించాలి. రోగాల బారిన పడి ఇబ్బంది పడే బదులు, అవి సోకకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి. దోమలను అరికట్టి, స్వచ్ఛమైన నీరు, ఆహారం తీసుకోవాలి. బాగా నిద్ర పోవాలి.

బీమా పథకాలను పునరుద్ధరించాలి



పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడుతున్న మిత్రలు

హయత్‌నగర్: ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన బీమా పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర బీమా మిత్ర సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అనీలా రెడ్డి కోరారు. బుధవారం పలువురు మిత్రలతో కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలకు సహాయంగా ఉండే విధంగా బీమా మిత్రల ఆధ్వర్యంలో అభయహస్తం, జనశ్రీ బీమా యోజన, లోన్ ఇన్స్యూరెన్స్ తదితర పథకాలు అమలు జరిగేవని పేర్కొన్నారు. కానీ గత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. ఆయా పథకాలను పునరుద్ధరించి.. మహిళలకు చేయూతనివ్వాలని, బీమా మిత్రలకు ఉపాధి కల్పించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన పీసీసీ అధ్యక్షుడు.. సీఎం కార్యాలయానికి లేఖ రాశారని అనీలారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మిత్రలు రమాదేవి, సునీత, చంద్రవతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆ చానల్‌పై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ వెంకటేశ్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై అసత్య ఆరోపణలు ప్రచారం చేసిన యూట్యూబ్ చానల్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్‌కు ఫిర్యాదుపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత ప్రతిష్ఠతకు భంగం కలిగించేలా కథనాలను ప్రసారం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వెంటనే ఆ మాధ్యమ నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ ఎంపీపీ విజయ్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు సాయి, కొండల్‌రెడ్డి, నాజర్, కృష్ణ, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభను జయప్రదం చేయండి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరుకానున్నరని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సభకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, ఎలా ముందుకు తీసుకెళ్లాలి, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, శంకర్, జగన్, రామకృష్ణ, యాదయ్యగౌడ్, రాజేందర్, శేఖర్‌గౌడ్, రాజునాయక్, సక్రునాయక్ తదితరులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఆమనగల్లు: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2004– 05 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన నాటి విద్యార్థులు.. బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్ వేదికగా రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న బాల్యమిత్రులందరూ.. సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకుచేసుకొంటూ ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు శోభారాణి, హేమలత, నారాయణగౌడ్, లలిత, షీలా, కరుణ, రాజేశ్వరి, శోభారాణి, బుచ్చమ్మ, ఎలిజబెత్, శ్యామలాదేవి, కుమార్, విద్యార్థులు స్వాతి, పల్లవి తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థినులు

సమస్య తలెత్తకుండా వ్యాపారం చేసుకోండి

బడంగ్‌పేట్: సమస్యలు తలెత్తకుండా వీధి వ్యాపారాలు నిర్వహించుకోవాలని, అందుకు కార్పొరేషన్‌తో పాటు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టౌన్ వెడ్డింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి వ్యాపారులు సమస్యలు తలెత్తకుండా వ్యాపారాలు కొనసాగించాలాని కోరారు. చిరు వ్యాపారాలు బిజినెస్ గ్రీన్ జోన్లుగా ఉండాలని సూచించారు. వారికి ఎల్లప్పుడూ పోలీస్ బందోబస్తోతో పాటు టౌన్ ప్లానింగ్ అనుమతులు ఉంటాయన్నారు. వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా 5 శాతం సబ్సిడీతో రూ.10వేలు రుణాలను తక్షణమే అందిస్తున్నట్లు వెల్లడించారు. సకాలంలో కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386